# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

సోమవారం 20 మే 2024

సంపుటి.01 సంచిక.308




# రోజూ రూ.కోటిన్నర.. మరి నష్టాలెలా?.. మెట్రోకు భారమవుతున్న వడ్డీలు

**హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రోలో సగటున ప్రతిరోజు 4.5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వారి నుంచి ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థకు టికెట్ల ద్వారా రూ.కోటిన్నర ఆదాయం సమకూరుతోంది. సగటున ఒక్కో ప్రయాణికుడు రూ.35 చెల్లించి మెట్రోలో వెళుతుండగా.. సగటు ప్రయాణ దూరం(12.5 కి.మీ.) కూడా తక్కువగానే ఉంది. ప్రయాణికుల నుంచి ఛార్జీలే కాకుండా ప్రకటనలు, స్టేషన్లు, మాల్స్ లీజింగ్ ద్వారా కూడా ఆదాయం సమకూరుతోంది. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆపరేషన్స్, ఇతరత్రా కలిపి రూ.703.20 కోట్ల ఆదాయం వచ్చింది. మెట్రో నిర్వహణ వ్యయం రూ.429 కోట్లుగా సంస్థ పేర్కొంది. నికరంగా చూస్తే లాభమే కదా? మరి నష్టాలు ఎక్కడివి అంటారా..? మెట్రోరైలు, మాల్స్ నిర్మాణానికి రూ.12,500 కోట్లపైన ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ కొంత ఈక్విటీ, మిగిలింది బ్యాంకుల కన్సార్షియం నుంచి రుణాలు తెచ్చింది. 2023 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి.. ఏటా రుణాలపై వడ్డీనే రూ.1273 కోట్లు అని తన ఆర్థిక నివేదికలో పేర్కొంది. అయితే, ఈ వడ్డీ భారాన్ని 2024 ఆర్థిక సంవత్సరంలో కొంతమేర తగ్గించుకుంది.

మాల్స్, భూముల సబ్‌లీజుపై.. గత ఆర్థిక సంవత్సరం రూ.900 కోట్ల వడ్డీలేని రుణాన్ని ప్రభుత్వం ఇచ్చింది. రాయదుర్గంలోని 15 ఎకరాల భూమిని రూ.1045 కోట్లకు మానిటైజ్ చేసింది. ఇందులో గతేడాది రూ.512 కోట్లు ఎల్ అండ్‌టీకి చేరాయి. ఎర్రమంజిల్, పంజాగుట్ట, హైటెక్‌సిటీ మాల్స్‌ను సబ్‌లైసెన్స్ ద్వారా రూ.3 వేల కోట్లకు మరో సంస్థతో ఒప్పందం చేసుకుంది. వీటన్నింటిని ద్వారా రూ.5 వేల కోట్ల రుణభారాన్ని దించుకునే దిశగా సర్దుబాట్లు చేసింది. ఫలితంగా వడ్డీ భారం గణనీయంగా తగ్గనుంది.



# ఐదో విడతలో జోరెవరిదో!



**నేడు 49 లోక్‌సభ స్థానాలకు పోలింగ్**

**రాయ్‌బరేలీ, అమేఠీలపై అందరి దృష్టి**

**బెంగాల్‌లో భారీగా బలగాల మోహరింపు**

**ముంబయి నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన సిబ్బంది**

**ఢిల్లీ:** కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ దేశంలో మరో దశ పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికల ఐదో విడతలో భాగంగా ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాలకు సోమవారం ఓటింగ్ జరగనుంది. వీటిలో మొత్తంగా 695 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ జాబితాలో రాజ్‌నాథ్ సింగ్, పీయూష్ గోయల్, స్మృతి ఇరానీ తదితర కేంద్ర మంత్రులతోపాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా వంటి ప్రముఖులు ఉన్నారు. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 14, మహారాష్ట్రలో 13, పశ్చిమ బెంగాల్‌లో 7, బిహార్‌లో 5, ఝార?ండ్‌లో 3, జమ్మూకశ్మీర్‌లో 1, లద్దాఖ్‌లో 1 స్థానానికి పోలింగ్ జరుగుతుంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలను ఏడు విడతల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దేశంలో మొత్తంగా 543 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఐదో దశతో కలిపితే 428 సీట్లకు పోలింగ్ పూర్తవుతుంది.

**రాయ్‌బరేలీ, అమేఠీలపై అందరి దృష్టి**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, అమేఠీ స్థానాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ రెండూ కాంగ్రెస్‌కు కంచుకోటల్లాంటి సీట్లు. అయితే అయిదేళ్ల కిందట అమేఠీలో రాహుల్‌గాంధీపై స్మృతి ఇరానీ విజయం సాధించి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం రాహుల్ రాయ్‌బరేలీలో పోటీ చేస్తున్నారు. అమేఠీలో స్మృతి ఇరానీపై గాంధీ కుటుంబ సన్నిహితుడు కిశోరీలాల్ శర్మను కాంగ్రెస్ బరిలో దించింది. లఖ్‌నవూలో హ్యాట్రిక్‌పై రాజ్‌నాథ్ సింగ్ గురిపెట్టారు.

**బారాముల్లాలో 500 మందికిపైగా శతాధిక వయస్కులు**

జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గానికి ఈ విడతలో పోలింగ్ జరగనుంది. ఇక్కడ 17.37 లక్షల ఓటర్లు ఉన్నారు. అందులో 500 మందికిపైగా శతాధిక వయస్కులు కావడం గమనార్హం. బారాముల్లాలో మొత్తం 22 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వారిలో 14 మంది స్వతంత్రులు. ఇక్కడ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాకు మాజీ మంత్రి సజ్జాద్ లోన్ నుంచి గట్టి సవాలు ఎదురవుతోంది. జైల్లో ఉండి పోటీ చేస్తున్న అవామీ ఇత్తెహాద్ పార్టీ నేత అబ్దుల్ రషీద్ షేక్ అలియాస్ ఇంజినీర్ రషీద్‌నూ తక్కువగా అంచనా వేయలేం.

పశ్చిమ బెంగాల్‌లో ఏడు సీట్లకు ఈ దశలో పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రతి విడతలోనూ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీనికితోడు ఐదో విడతలోని 57% పోలింగ్ కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించడంతో.. ముందుజాగ్రత్త చర్యగా 60 వేలకుపైగా కేంద్ర బలగాలతోపాటు 29,172 మంది రాష్ట్ర పోలీసులను మోహరించారు.




# ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో పట్టణ రాష్ట్రంగా తెలంగాణ

**పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అనుకూలమైన వాతావరణం, మంచి నీటి వసతి, నిరంతర విద్యుత్తు సరఫరా, శాంతిభద్రతలు, స్నేహపూర్వక ప్రభుత్వం కారణంగా హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతోందని చెప్పారు.**

**పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామం**

**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమావేశంలో మాట్లాడుతున్న మల్లు భట్టి విక్రమార్క, వేదికపై శ్రీనివాసమూర్తి, ప్రశాంత్, ఆనంద్, శేఖర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సాయి దేవరాజుల ప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి**

**మాదాపూర్:** పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అనుకూలమైన వాతావరణం, మంచి నీటి వసతి, నిరంతర విద్యుత్తు సరఫరా, శాంతిభద్రతలు, స్నేహపూర్వక ప్రభుత్వం కారణంగా హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతోందని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంతో తెలంగాణ పట్టణ రాష్ట్రంగా రూపొందుతుందన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటుచేసిన మూడు రోజుల గ్రీన్ ప్రాపర్టీ షో ఆదివారం సాయంత్రం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆర్ఆర్ఆర్ నిర్మాణం ఆలస్యమైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. తెలంగాణలోని అన్ని గ్రామాల్లో గ్రీన్, నెట్ జీరో కాన్సెప్ట్‌లకు సీఐఐ-ఐజీబీసీ సహకారం అందించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడేలా హరిత భవన నిర్మాణాలు చేపట్టేందుకు ఐజీబీసీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 146 కోట్ల చదరపు అడుగుల నిర్మాణం పూర్తికావడం... 2.50 లక్షల రెసిడెన్షియల్ యూనిట్లను పర్యావరణహితం (గ్రీన్)గా మార్చడం ఓ పెద్ద ముందడుగని పేర్కొన్నారు. 50 శాతం నీరు, 40 శాతం విద్యుత్తును ఆదా చేసే రీతిలో నిర్మించే హరిత భవనాలకు ప్రభుత్వం తరఫున ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. గతం నుంచీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలకుల దూర దృష్టి కారణంగానే హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ విమానాశ్రయం, కృష్ణా జలాలు, మెట్రోరైలుకు శంకుస్థాపన వంటి అనేక కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రాణం పోసుకున్నాయని పేర్కొన్నారు.

**మూడు నెలల్లో పనులు ప్రారంభం...**

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపొందనున్న ఆర్ఆర్ఆర్ సూపర్ గేమ్‌ఛేంజర్ అవుతుందన్నారు. మూడు, నాలుగు నెలల్లో నిర్మాణం ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా తమది వన్ మ్యాన్‌షో కాదని... సమష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఐజీబీసీ నేషనల్ వైస్‌ఛైర్మన్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణహితమైన హరిత భవనాలు నిర్మించేవారికి, కొనేవారికి ఆస్తిపన్ను, రిజిస్ట్రేషన్ ఛార్జీల్లో రాయితీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రాపర్టీ షోలో స్టాళ్లు ఏర్పాటు చేసిన పలు నిర్మాణ సంస్థలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి దేవరాజుల ప్రసాద్, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, హైసియా అధ్యక్షుడు ప్రశాంత్, ఐజీబీసీ డిప్యూటీ డైరెక్టర్ ఆనంద్, సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటగిరి, ఐజీబీసీ కో ఛైర్‌పర్సన్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మానాన్నలే హంతకులయ్యారు

**అల్లారుముద్దుగా పెంచిన అమ్మానాన్నలే కుమార్తెను హతమార్చారు. మానసిక స్థితి సరిగా లేదని ఆసుపత్రులు, దేవాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన చెందిన తల్లిదండ్రులు 13 నెలల మనవడికి తల్లిని దూరం చేశారు.**

**కుమార్తెకు మానసిక సమస్య**

**ఎంత ప్రయత్నించినా నయం కాకపోవడంతో .. నిద్రిస్తుండగా హత్యచేసిన తల్లిదండ్రులు**

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన.. దంపతుల అరెస్టు**

**సిరిసిల్ల:** అల్లారుముద్దుగా పెంచిన అమ్మానాన్నలే కుమార్తెను హతమార్చారు. మానసిక స్థితి సరిగా లేదని ఆసుపత్రులు, దేవాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన చెందిన తల్లిదండ్రులు 13 నెలల మనవడికి తల్లిని దూరం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం నేరెల్ల గ్రామానికి చెందిన చెప్యాల నర్సయ్య-ఎల్లవ్వ దంపతుల పెద్ద కుమార్తె ప్రియాంక(25) గత ఏడు



సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఆమెను ఆసుపత్రులు, దేవాలయాల వద్దకు తీసుకెళ్తూ చాలా డబ్బు ఖర్చు చేశారు. కొంతవరకు వ్యాధి నయం కావడంతో 2020లో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని దర్గాపల్లికి చెందిన పృథ్వీతో వివాహం చేశారు. వారు కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీలో ఉంటున్నారు. వీరికి 13 నెలల కుమారుడు ఉన్నాడు.నెల రోజులుగా ప్రియాంక మునుపటి లాగే మానసిక వ్యాధితో బాధపడుతూ అందరిని ఇబ్బంది పెడుతోంది. చుట్టుపక్కల వారిని దూషించడం, గొడవలు పెట్టుకోవడంతో భర్త.. ఆమె తల్లిదండ్రులకు తెలియజేశాడు. వారు బుగ్గరాజేశ్వరస్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లి అక్కడ మూడు రోజులు ఉంచారు. నయం కాకపోవడంతోపాటు ఆమె ప్రవర్తనను చూసి తల్లిదండ్రులు విసిగిపోయారు. నేరెల్లకు తీసుకొచ్చి ఈ నెల 14న రాత్రి ఆమె ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో నూలు దారం గొంతుకు బిగించి హత్య చేశారు. 15న అత్తగారి గ్రామం దర్గాపల్లికి తీసుకెళ్లి చేతబడి వల్ల మరణించిందని చెప్పి నమ్మించి అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై నేరెల్ల గ్రామస్థులకు అనుమానం రావడంతో డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేయగా తల్లిదండ్రులే హత్య చేసినట్లు తేలడంతో స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు నుంచి ఫిర్యాదు తీసుకొని వారిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

# రైతులు అధైర్య పడొద్దు.

## ఐదు రోజుల్లో 95 శాతం పంట కొనుగోలు చేస్తాం. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.



కామారెడ్డి, మే 20:వేగుచుక్క న్యూస్,

రాబోయే ఐదు రోజుల్లో 95 శాతం పంట కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చెప్పారు. ఆదివారం రామారెడ్డి మండలం పోసానిపేట ,గిద్దలో కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తో కలిసి పరిశీలించారు. అక్కడ ధాన్యం లో తేమను పరిశీలించి రైతులతో మాట్లాడి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 350 కొనుగోలు కేంద్రాల ద్వారా 46,613 మంది రైతుల నుండి 576 కోట్ల విలువ గల 2.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో 504 కోట్లు జమ చేశామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 200 కేంద్రాలలో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. మరో రెండు రోజుల్లో ముప్పై కేంద్రాలలో ధాన్యాన్ని , ఆ మరో రెండు రోజులలో 40 కేంద్రాలలో ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ నెలాఖరునాటికి లక్ష్యం మేరకు రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను పూర్తిగా కొనుగోలు చేస్తామని కలెక్టర్ చెప్పారు . రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం యావత్తు ధాన్యం సేకరణ ప్రక్రియలు నిమగ్నమై ఉందని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో
పాటు క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, సహకార శాఖ, పౌరసరఫరాల అధికారులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ రైతులు ఎక్కడ ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నారని అన్నారు. ప్రతిరోజు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్ల తో సమీక్షిస్తూ ధాన్యాన్ని కేంద్రాల నుంచి మిల్లులకు తరలిస్తున్నామని, మిల్లర్లు కూడా ఎంతో సహకరిస్తున్నారని కలెక్టర్ అన్నారు. కొన్ని మిల్లర్లు డిఫాల్ట్ గా ఉన్నాయని, ధాన్యం దించుకోవడం లేదని వస్తున్న వార్తల్లో నిజం లేదని , జిల్లా యంత్రాంగానికి పూర్తిగా సహకరిస్తున్నారని అన్నారు .మిల్లుల సామర్థ్యం మేరకు ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం తరలిస్తూ త్వరగా అన్లోడ్ అయ్యే విధంగా అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని రైతులు అధైర్యపడవద్దని కలెక్టర్ అన్నారు. వాతావరణం పొడిగా ఉందని నాలుగైదు రోజులు వర్షాలు కురిసే అవకాశాలు లేవని రైతులు ధైర్యంగా ఉండాలని అన్నారు. ఒకవేళ వర్షాలు పడ్డా తడిచిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని భరోసానిచ్చారు.

రైతులు కూడా అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని సూచించారు. తహసీల్దార్లు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో త్వరితగతిన ధాన్యం తూకం వేసి ట్యాగ్ చేసిన మిల్లులకు తరలిస్తారని, రైతులకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పిస్తారని కలెక్టర్ చెప్పారు.

కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, తహసీల్దార్, ఉప తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్స్ పై క్రిమినల్ కేసులు పెట్టాలి.

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే19



జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేస్తున్నాయని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ ఆరోపించారు.
ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ప్రైవేట్ ఆసుపత్రుల తీరు పై మండిపడ్డారు. ఇటీవల కీర్తి సాయి హాస్పిటల్ లో నాలుగు నెలల గర్భిణి మృతికి కారణమంటు మృతురాలి బంధువులు హాస్పిటల్ ముందు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. అదేవిధంగా మెడికవర్ హాస్పిటల్ లో రేంజల్ మండలానికి చెందిన వ్యక్తి గుండె జబ్బుతొ హాస్పిటల్ చేరి సరైన సమయంలో చికిత్స అందకపోవడంవల్ల మృతి చెందినా కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు వసూలు చేశారని, మృతుడి కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్ద ప్లే కార్డులతో ఆందోళనకు దిగినా ప్రభుత్వ యంత్రాంగం ఇంతవరకు చర్యలు తీసుకోలేదని అన్నారు.

**అదేవిధంగా కామారెడ్డి**

జిల్లా జుక్కల్ మండలం, మర్మా గ్రామానికి చెందిన 23 సంవత్సరాల గంగాధర్ అనే యువకుడు ప్రమాదవశాత్తు బైక్ నుండి కింద పడి తలకు తీవ్రమైన గాయం కావడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణ న్యూరో సర్జన్ హాస్పిటల్ లో చేర్పించారు. తలకు ఆపరేషన్ చేస్తే 23 సంవత్సరాల యువకుడు కోమాలోకి వెళ్ళాడు. అయినా సరే ఆక్సిజన్ ద్వారా చికిత్స అందించడం ద్వారా 3 లక్ష రూపాయలను హాస్పిటల్ యాజమాన్యం వసూలు చేసింది. ఇంకా డబ్బులు కావాలని హాస్పిటల్ యాజమాన్యం అడగడంతో వారికి అనుమానం వచ్చి ఇప్పటి వరకు చేసిన చికిత్స వివరాల రిపోర్ట్ ఇవ్వమని అడగడంతో ఆక్సిజన్ తొలగిస్తే పేషెంట్ చనిపోతాడని, ఇంకా హాస్పిటల్ కు ఒక లక్ష 80 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారన్నారు. గంగాధర్ కుటుంబ సభ్యులు బిఎల్ఎఫ్ కార్యాలయానికి వచ్చి జరిగిన విషయాన్ని చెప్పడంతో హాస్పిటల్ యాజమాన్యాన్ని నిలదీయడంతో అచేతనంగా పడి ఉన్న గంగాధర్ బాడీని డబ్బులు ఇవ్వకుండానే ఇప్పించడం జరిగిందని దండి వెంకట్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ పిశాచాల్ల ప్రజల రక్తమాంసాలు పీల్చి పిప్పి చేస్తున్నాయని బాధితుల నుండి పిర్యాదులు వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని చెప్పారు.
గతంలో కరోనా సమయంలో కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ పై వచ్చిన ఆరోపణలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటిసులు ఇచ్చినట్లు మీడియా సాధనాల్లో వచ్చాయని ఆయన చెప్పారు. కానీ వాటిపై ఏమైనా చర్యలు తీసుకున్నారో లేదో ప్రజలకు మీడియా ద్వారా చెప్పాల్సిన అధికారులు ఇంతవరకు ఉలుకూపలుకు లేకుండాఉన్నారని దండి వెంకట్ పేర్కొన్నారు.

# ఇకపై "టీఎస్" కు బదులు "టీజీ"

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 19 :

తెలంగాణ సంక్షిప్త పదాన్ని ' టీఎస్ ' కు బదులు ' టీజీ ' గా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ)లు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్ లలో తెలంగాణ సంక్షిప్త పదం టీజీ గా పేర్కొనాలని ఆ ఉత్తర్వులలో సూచించిందని అన్నారు. ఈ మేరకు కేంద్రం అనుమతిస్తూ, గెజిట్ జారీ చేసిందని తెలిపారు. గత మార్చి నెలలోనే వాహనాల రిజిస్ట్రేషన్ కు సంబంధించిన అనుమతులు రాగా, తాజాగా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీఎస్ కు బదులు టీజీ గా వ్యవహరించేందుకు అనుమతించిందని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్వయం ప్రతిపత్తి కలిగిన విభాగాలన్నీ దీనిని విధిగా పాటించాలని ఆదేశించారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్ సైట్లు, ఆన్లైన్ ఫ్లాట్ ఫార్మ్లు, పాలసీ పేపర్లు, ఇతర అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని కలెక్టర్ సూచించారు. అన్ని అధికారిక వ్యవహారాలకు వర్తింపజేసేలా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణమే ఇవి అమల్లోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో టీఎస్ కు బదులు టీజీ గా మారుస్తూ, ఈ నెల 26వ తేదీ లోగా నివేదికలు సమర్పించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

# ప్రకృతి విపత్తులు మానవ ప్రేరితాలేనా?

ప్రకృతి విపత్తులు, మానవ ప్రమేయ ప్రమాదాలు గత కొన్నేళ్లుగా క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. భూతాప ప్రకోపాలు, వైరస్ విపత్తులు, మానవ ప్రమేయ విస్పోటనాలు, పర్యవరణ ప్రతికూల మార్పులు, అకాలవర్ష వడగళ్లు, వరదలు, వడగాలులు, కరువుకాటకాలు లాంటివి ప్రపంచ మానవాళిని అతలాకుతలం చేస్తూనే ఉన్నాయి, ముందు ముందు మన వెంట పడుతూనే ఉంటాయి. 1970ల్లో ఏడాదికి 100 చొప్పున నమోదైన విపత్తులు గత రెండు దశాబ్దాల్లో ప్రతి ఏట 400 విపత్తుల వరకు విరుచుకుపడడం గమనించారు.

విపత్తుల ప్రతికూల ప్రభావాలు:

ఐరాస అనుబంధ సంస్థ 'ఆహార వ్యవసాయ సంస్థ లేదా ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, ఎఫ్ఏఓ' తాజాగా విడుదల చేసిన 'వ్యవసాయం, ఆహార భద్రతపై విపత్తుల ప్రభావం (ది ఇంపాక్ట్ ఆఫ్ డిజాస్టర్ ఆన్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ సెక్యూరిటీ)' నివేదికలో పలు ఆసక్తికర, భయానక అంశాలను బహిర్గత పరిచింది. ప్రకృతి విపత్తులు, వాతావరణ ప్రతికూల మార్పులతోప్రపంచవ్యాప్త వ్యవసాయం, ఆహార భద్రత, జీవనోపాధి రంగాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయని తెలుస్తున్నది. సుస్థిర వ్యవసాయం, అన్ని వర్గాల అభివృద్ధి దిశగా విపత్తులను తట్టుకునే అంశాల పట్ల అవగాహన, రాకుండా జాగ్రత్త పడడం లాంటి సూచనలు చేసేందుకు ఈ నివేదిక ఉపయుక్తంగా ఉంటుందని వివరించబడింది. విపత్తుల నియంత్రణలో ప్రభుత్వ సంస్థలతో పాటు పౌర సమాజం కూడా సమాన భాగస్వామ్యం తీసుకోవాలని మరువకూడదు.

**విపత్తుల విధ్వంసంతో మానవాళి అతలాకుతలం:**

సమాజంపై ఊహించని, ఆకస్మిక ప్రమాదకర విధ్వంసాలను విపత్తులుగా పేర్కొనవచ్చు. విపత్తులతో మానవ జాతి, వస్తు సమూహాలు, ఆర్థికం, పర్యావరణ విధ్వంసం లాంటివి జరగవచ్చు. విపత్తులతో జలావరణం, పర్యావరణం, శిలావరణం, వాతావరణం, జీవావరణాలపై ప్రతికూల ప్రభావాలు పడతాయని మన గత అనుభవాలు వివరిస్తున్నాయి. విపత్తుల తీవ్రతను బట్టి విశ్వ మానవాళిపై తీవ్ర ప్రభావం పడుతుంది. అతివృష్టి, అనావృష్టి, వరదలు, నీటి ఎద్దడి, తీవ్ర వడగాలులు, కరువులు, ప్రతికూల వాతావరణ మార్పులు లాంటివి వ్యవసాయ/మత్స్య/పాడి ఉత్పత్తుల పైననే కాకుండా జీవనోపాధి, పోషకాహార లభ్యత, ఆహార లభ్యత, ఉద్యోగ ఉపాధులు, అసంఘటిత వర్గాల ఆదాయాల్లో కోతలు, వలసల వరదలు లాంటి అంశాలపై కూడా ప్రభావాన్ని చూపుతాయి. తీవ్రమైన వడగాలులతో ఆహార ధాన్యాల ఉత్పత్తులు 1964 – 1990 మధ్య 2.2 శాతం తగ్గితే, 1991 – 2015 మధ్య 7.3 శాతం వరకు ఉత్పత్తుల దిగుబడులు పడిపోవడం విచారకరం.

**విపత్తులు విశ్వవ్యాప్తం:**

విపత్తు ప్రమాదాల కారణంగా వాతావరణ మార్పులు, పేదరికం, అసమానతలు, జనాభా పెరుగుదల, ప్రజారోగ్యం లాంటివి ప్రభావితం అవుతాయి. తీవ్ర వడగాలులతో నీటి లభ్యత, పశువుల మరణాలు, పాల ఉత్పత్తులు తగ్గడం, జంతు సంతానోత్పత్తి ప్రభావితం కావడం కూడా గ్రామీణ వర్గాల జీవనోపాధులను మింగేస్తున్నది. తక్కువ వర్షపాతం, భూగర్భ నీటి కొరత, నీటి ఒత్తిడి, నేల నీటి కొరత లాంటివి కూడా సాగుబడి రైతులపై కొరడా ఝులుపుతున్నాయి. 2022లో పాకిస్థాన్ ఎదుర్కొన్న అతివృష్టితో 4 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఉత్పత్తుల నష్టం, అమెరికాలో 21.4 బిలియన్ డాలర్ల పంట నష్టం నమోదు కావడం చూసాం. 2007 – 2023 మధ్య జరిగిన 88 విపత్తులతో 23 శాతం వరకు పంట నష్టాలు నమోదు కావడం గుర్తించారు. విపత్తుల్లో కరువు వల్ల 65 శాతం నష్టం గమనించగా, వరదలు/తుఫాన్లు/వాల్కనోల కారణంగా 20 శాతం పంట నష్టం జరిగింది. గత 31 ఏండ్లుగా జరిగిన అనేక ప్రమాదకర విపత్తులతో ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి సగటున 123 బిలియన్ల చొప్పున మొత్తంగా 3.8 ట్రిలియన్ల నష్టం (5 శాతం ప్రపంచ వ్యవసాయ జిడిపీ) వాటిల్లడం జరిగింది. గత మూడు దశాబ్దాలు విపత్తులతో కర్షక లోకం సాలీనా 69 మిలియన్ టన్నుల ధాన్యం, 40 మిలియన్ టన్నుల పండ్లు/కూరగాయలు, 16 మిలియన్ టన్నుల మాంసం/పాడి ఉత్పత్తులు/గుడ్లు నష్టపోవడం గమనించారు. విపత్తుల ధాటికి ఆసియా దేశాలు 45 శాతం, ఆఫ్రికా/యూరోప్/యూస్ ప్రాంతాలు 45 శాతం విపత్తు కారణ ఆర్థిక నష్టాలను చవిచూశాయి. శీతల మంచు ప్రాంతాల్లో విపత్తు నష్టాలు కనిష్టంగా నమోదు అయ్యాయి. గత 31 ఏండ్లుగా విపత్తులతో ప్రపంచ జనాభాలో సగటున ఒక్కొక్కరు రోజుకు 147 కిలో కాలరీల పోషకాహారానికి దూరం అవుతున్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా విపత్తు ప్రమాదాల మూలంగా 31 శాతం ఆసియా/యూఎస్, 24 శాతం యూరోప్, 11 శాతం ఆఫ్రికా, 3 శాతం సముద్ర మంచు ప్రాంతాలు పోషకాహార నష్టాలకు గురి అయ్యారు.

**విపత్తు నిర్వహణ మార్గాలు:**

విపత్తుల ముందస్తు అంచనా, నష్టాలను తగ్గించే పరిజ్ఞానాలు, ప్రమాదాల నుంచి ప్రాణ నష్ట నివారణ లాంటి అంశాల్లో మానవాళి కనీస అవగాహన కలిగి ఉండాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం విపత్తు నష్ట నివారణ పాలసీలు/పథకాల పట్ల అవగాహనతో పాటు సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకునే విశ్వాసాలను కలిగించే వ్యవస్థలు నెలకొల్పాలి. కరోనా విపత్తు, విష జ్వరాలు, యుద్ధాలు/సంఘర్షణలు ప్రపంచ మానవాళికి ఎన్నో పాఠాలను/గుణపా ఠాలను నేర్పాయి. విపత్తు నిర్వహణ వ్యవస్థలకు అవసర నిధుల కేటాయింపు, పౌరులకు విపత్తు నిర్వహణలో శిక్షణలు నిరంతరం కొనసాగాలి. మానవ ప్రమేయ విపత్తులకు అడ్డుకట్ట వేయడం, పర్యావరణ పరిరక్షణకు కంకణ బద్దులు కావడం, పౌర సమాజం భాద్యతాయుతంగా వ్యవహరిం చడం లాంటివి నష్టాన్ని భారీగా తగ్గిస్తాయని మరువరాదు. సహజ విపత్తులు జరగకుండా ఆపలేం, కాని మానవ ప్రమేయ .

# సహారా గ్రూప్ చీఫ్ మృతి..

సహారా గ్రూప్ అధినేత సుబ్రతా రాయ్ మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఆయన మరణానంతరం ప్రధానంగా సెబీ వద్ద ఉన్న రూ.25 వేల కోట్ల నగదు ఫోకస్‌లోకి వచ్చింది. సహారా గ్రూప్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ సుబ్రతా రాయ్ కన్నుమూశారు. 75 ఏళ్ల ఆయన గుండెపోటు రావడంతో మంగళవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచినట్లు సహారా గ్రూప్ ప్రకటన చేసింది. అయితే, ఇప్పుడు ఓ అంశం తెరపైకి వచ్చింది. అదే సెబీ వద్ద పంపిణీ చేయకుండా ఉన్న రూ.25 వేల కోట్ల నిధులు అంశం వెలుగులోకి వచ్చింది. ఆ డబ్బులు సహారా ఇన్వెస్టర్లకు పంపిణీ చేస్తారా? సుబ్రతా రాయ్ మృతి నేపథ్యంలో ఏం జరగనుంది? అనేది ప్రస్తుతం చర్చకు దారి తీసింది. ఆ వివరాలు ఓసారి పరిశీలించే ప్రయత్నం చేద్దాం. సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతా రాయ్ మరణానంతరం క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ఖాతాల ఉన్న పంపిణీ చేయని ఫండ్స్ రూ.25 వేల కోట్లు ప్రస్తుతం ఫోకస్ లోకి వచ్చాయి. ఆయన పోజీ స్కీమ్‌లతో నిబంధనలు అతిక్రమించినట్లు నియంత్రణ, చట్టపరమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2011లో క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబీ.. రెండు సహారా గ్రూప్ సంస్థలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అందులో సహారా ఇండియా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ లిమిటెడ్, సహారా హౌసింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు ఉన్నాయి. బాండ్ల ద్వారా సుమారు 3 కోట్ల మంది ఇన్వెస్టర్ల ద్వారా సేకరించిన డబ్బులను రిఫండ్ చేయాలని ఆదేశించింది సెబీ. తమ రూల్స్, రెగ్యూలేషన్స్‌ను అతిక్రమించినట్లు గుర్తించిన క్రమంలో
ఈ ఆదేశాలు జారీ చేసింది సెబీ. దీర్ఘకాలం పాటు ఈ అంశంపై పోరాటం చేశారు సహారా చీఫ్ సుబ్రతా రాయ్. అయితే, సుప్రీం కోర్టులో ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది. ఆగస్టు 31, 2012న సెబీ ఆదేశాలను సమర్థిస్తూ సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. సహారాకు చెందిన ఆ రెండు సంస్థలు ఇన్వెస్టర్ల నుంచి వసూలు చేసిన డబ్బులను 15 శాతం వడ్డీ రేటుతో తిరిగి చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే, 95 శాతానికిపైగా ఇన్వెస్టర్లకు నేరుగా రిఫండ్ చేసినట్లు గ్రూప్ వెల్లడించింది. అయినప్పటికీ పెట్టుబడిదారులకు తదుపరి రిఫండ్ కోసం సెబీ వద్ద దాదాపు రూ.24 వేల కోట్లు డిపాజిట్ చేయాల్సిందిగా సుప్రీం కోర్టు తెలిపింది. 11 ఏళ్ల తర్వాత సుమారు రూ.138.07 కోట్లు రీఫండ్ చేసినట్లు సమాచారం. మరోవైపు.. సెబీ ప్రత్యేకంగా తెరిచిన బ్యాంక్ ఖాతాలో రూ.24 వేల కోట్లు జమ చేయగా.. ఇప్పుడు అవి రూ.25 వేల కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. సెబీ వార్షిక నివేదిక ప్రకారం.. మార్చి 31, 2023 నాటికి 19,650 దరఖాస్తులు వచ్చాయి. అందులో 17,526 దరఖాస్తులకు సంబందించి రూ. 138.07 కోట్లు రిఫండ్ చేసింది. అందులో వడ్డీ రూ.67.98 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. మిగిలిన దరఖాస్తుల కు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో వాటిని తిరస్కరించినట్లు తెలిపింది. ప్రస్తుతం సహారా గ్రూప్ అధినేత సుబ్రతా రాయ్ మృతి చెందిన క్రమంలో మరోసారి ఆ రూ.25 వేల కోట్లు ఫోకస్‌లోకి వచ్చాయి. ప్రస్తుతం సెబీ ఎలాంటి నిర్ణయం తీసుకోనుందని వేచి చూడాల్సిందే.